**విలేకరులు కావలెను**

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455

epaper.hindusthanmedia.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దినపత్రిక — సామాన్యుడి నేస్తం




ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 78 ఆదివారం జూలై 19 2026, పేజీలు - 4 వెల :2/-

# కేసీఆర్ కుటుంబీకులు నిజాం రాజును మించిన ధనవంతులుగా మారారు

- ఘట్‌కేసర్‌లో అందెశ్రీ స్మృతివనానికి భూమిపూజ
- అందెశ్రీ ఒక ఆత్మబంధువు అని కొనియాడిన సీఎం రేవంత్ రెడ్డి
- కేసీఆర్ ప్రభుత్వం పై తీవ్రస్థాయిలో విమర్శలు
- ఏడాదిలోనే 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని వెల్లడి
- తాను సీఎంగా ఉండగా బీఆర్ఎస్ అధికారంలోకి రాదని స్పష్టం

హిందుస్థాన్ మీడియా



కేసీఆర్ కుటుంబం వందలాది ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు నిర్మించుకుందని, వారు నిజాం రాజును మించిన ధనవంతులుగా ఎదిగారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రముఖ కవి, గాయకుడు, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిదాత అందెశ్రీ గౌరవార్థం ఘట్‌కేసర్‌లో నిర్మించనున్న 'అందెశ్రీ స్మృతివనం' పనులకు ముఖ్యమంత్రి శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగిస్తూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "దొరల గడీల ముందు తలవంచను" అని చాటిచెప్పిన ధైర్యశాలి అందెశ్రీ అని ముఖ్యమంత్రి కొనియాడారు. ప్రజల కవిగా, గాయకుడిగా అందెశ్రీ అందించిన సేవలను స్మరించుకుంటూ, ఆయనను తన 'ఆత్మ బంధువు'గా అభివర్ణించారు. గత పాలకులు ఆయన వంటి గొప్ప కళాకారులను విస్మరించారని మండిపడ్డారు. ఇదే క్రమంలో, కల్వకుంట్ల కుటుంబంపై రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతను పట్టించుకోకపోవడంతో వారు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఏళ్ల తరబడి గ్రూప్-1 వంటి పరీక్షలు కూడా నిర్వహించలేదని రేవంత్ రెడ్డి ఆరోపించారు. అందుకు భిన్నంగా, తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే సుమారు 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, అభ్యర్థుల తల్లిదండ్రుల సమక్షంలోనే నియామక పత్రాలను అందజేస్తున్నామని తెలిపారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్‌ల నిర్మాణం కోసం కేసీఆర్ కుటుంబం తెలంగాణ సంపదను దోచుకుందని, మళ్లీ ఎవరైనా అటువంటి ప్రయత్నం చేస్తే ఎదిరించడానికి అందెశ్రీ పాట రూపంలో పుడతాడని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందెశ్రీని తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని దుయ్యబట్టారు. ప్రజాకవి గద్దర్‌ను సైతం ప్రజాభవన్ గేటు వద్ద ఎర్రటి ఎండలో నిలబెట్టి అవమానించారని మండిపడ్డారు. వారిద్దరిని అవమానించినప్పుడే దొరల పాలనకు చరమగీతం పాడాలని తెలంగాణ ప్రజలు నిర్ణయించుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## 'ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్క'..




హిందుస్థాన్ మీడియా

తెలంగాణలో ఉద్యోగాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం యువతను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా ఉద్యోగ 'నోటిఫికేషన్ల'స్థానంలో 'లూటిఫికేషన్లు' చేస్తున్నారని విమర్శించారు. సరూర్‌నగర్‌లో నిర్వహించిన 'యువ సంగ్రామ' సదస్సులో మాట్లాడిన ఆయన.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "రేవంత్ గుర్తు పెట్టుకో.. నీ క్లైమాక్స్ హిట్లర్ కంటే దారుణంగా ఉంటుంది" అని హెచ్చరించారు. "ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్క. కాంగ్రెస్ ప్రభుత్వానికి యువతే తగిన గుణపాఠం చెబుతుంది. ప్రజలు, నిరుద్యోగ యువత ఈ అవమానాలను ఎప్పటికీ మర్చిపోరు" అని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రపంచంలోనే అతిపెద్ద మోసమని ఆరోపించారు. ఎన్నికల సమయంలో మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని అశోక్‌నగర్‌లో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు ఉద్యోగాల క్యాలెండర్‌ను పక్కనపెట్టి జేబులు నింపుకోవడంపైనే దృష్టి పెట్టారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చెబుతున్నట్లు 70 వేల ఉద్యోగాలు నిజంగానే ఇచ్చి ఉంటే.. అందుకు సంబంధించిన నోటిఫికేషన్లతో సహా నిరూపించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. అలా నిరూపిస్తే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొని రాహుల్ గాంధీకి జై కొడతానని ప్రకటించారు. ఈ సభ కాంగ్రెస్ చేసిన 'మహాద్రోహాన్ని' యువతకు గుర్తు చేసేందుకేనని అన్నారు. ఉద్యోగాలు అడిగిన యువతపై పోలీసులు దాడులు చేయడం దారుణమని కేటీఆర్ మండిపడ్డారు. అహంకారంతో వ్యవహరిస్తోందని విమర్శించారు.

# ఆగస్టు 1న చరిత్రలో నిలిచిపోయేలా భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం

- భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు
- ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇది మైలురాయి అని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- జీఎంఆర్ నిర్మించిన ఈ ప్రాజెక్ట్ తొలిదశ వ్యయం రూ. 4,592 కోట్లు
- తొలిదశలో ఏటా 63 లక్షల మంది ప్రయాణికులకు సేవలు

హిందుస్థాన్ మీడియా



ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతోంది. విశాఖపట్నం సమీపం లోని భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీంతో గత కొంతకాలంగా ప్రారంభోత్సవ తేదీపై నెలకొన్న ఊహాగానాలకు తెరపడింది. శనివారం సాయంత్రం విమానాశ్రయ నిర్మాణ పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన చంద్రబాబు, ఈ కీలక ప్రకటన చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయేలా అత్యంత ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఒక చారిత్రక మైలురాయిగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలోని పర్యాటకం, పోర్టులు, జాతీయ రహదారులు, పారిశ్రామిక ప్రగతితో కలిసి ఈ ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రను 'అన్‌స్టాపబుల్' శక్తిగా మారుస్తుందని ఆయన పేర్కొన్నారు. విజయనగరం జిల్లా భోగాపురం వద్ద, విశాఖ నగరానికి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి-16కు సమీపంలో సుమారు 2,200 ఎకరాల విస్తీర్ణంలో ఈ విమానాశ్రయాన్ని నిర్మించారు. ప్రఖ్యాత మౌలిక సదుపాయాల సంస్థ జీఎంఆర్ గ్రూప్‌కు చెందిన 'జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. తొలి దశలో భాగంగా రూ. 4,592 కోట్ల వ్యయంతో ఎయిర్‌పోర్టును నిర్మించారు. మొదటి దశలో ఏటా 63 లక్షల (6.3 మిలియన్ల) మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యంతో టెర్మినల్ భవనాన్ని తీర్చిదిద్దారు. భవిష్యత్తులో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రెండో దశలో 1.2 కోట్లు, మూడో దశలో 1.8 కోట్ల మందికి విస్తరించేలా మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఈ ప్రాజెక్టు పలు ప్రభుత్వాల హయాంలో పురోగతి సాధించింది. 2019 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 2024 సెప్టెంబర్‌లో ఈ విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' గా నామకరణం చేశారు. ప్రస్తుతం విశాఖ నగరంలోని ఐఎన్ఎస్ డేగా నేవల్ ఎయిర్‌బేస్ నుంచి కొనసాగుతున్న పౌర విమానయాన కార్యకలాపాలు దశలవారీగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు మారనున్నాయి. ఈ విమా నాశ్రయం చుట్టూ 'ఏరోట్రోపాలిస్'ను అభివృద్ధి చేసే ప్రణాళికలు కూడా ఉన్నాయి. ఈ విమానాశ్రయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర పారిశ్రామిక, పర్యాటక రంగాలకు కొత్త ఊపు వస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# గూడెం జడ్ పి హెచ్ ఎస్‌లో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేసిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ



హిందుస్థాన్ మీడియా:

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం జడ్ పి హెచ్ ఎస్ హైస్కూల్‌లో విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ పంపిణీ చేశారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,అదనపు కలెక్టర్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఎంపీకి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ...గత కొన్ని సంవత్సరాలుగా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్ఫూర్తితో తమ తాత కాకా వెంకటస్వామి ఈ ట్రస్ట్‌ను స్థాపించారని గుర్తుచేశారు.గూడెం జడ్ పి హెచ్ ఎస్‌లో విద్యార్థులు బెంచీలు లేక ఇబ్బందులు పడుతున్న విషయం తనను బాధించిందని, త్వరలోనే ఈ పాఠశాలకు అవసరమైన బెంచీలను అందజేస్తామని హామీ ఇచ్చారు.విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుకునే వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రతి విద్యార్థి బాగా చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమం అనంతరం ఎంపీ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

**-మీడియాతో ఎంపీ వంశీకృష్ణ వ్యాఖ్యలు**

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ, గూడెం జడ్ పి హెచ్ ఎస్ లో స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమానికి వస్తుండగా కొందరు కాంగ్రెస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేయడం బాధాకరమని అన్నారు.రాజకీయాల్లో విభేదాలు సహజమే అయినప్పటికీ,ప్రజల అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పనిచేయాలని సూచించారు.గతంలో గూడెం ఆలయ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో కూడా తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని గుర్తు చేశారు.అయితే అలాంటి విషయాలను తాను పట్టించుకోనని, ప్రజల అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయడమే తన ఆకాంక్ష అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు.

# క్యూర్ బిల్లులో జనాభా ప్రాతిపదికన ప్రభుత్వ పాఠశాలల ఏర్పాటును పొందుపర్చాలి

**-మెగా హైదరాబాద్‌లో ప్రభుత్వ పాఠశాలల సాధన కమిటీ ఏర్పాటు**

**-ప్రభుత్వ విద్య విస్తరణకు స్పష్టమైన విధానాలు, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ స్థాపనకు ప్రభుత్వాన్ని కోరిన ప్రతినిధులు**

హిందుస్థాన్ మీడియా:



కోర్ అర్బన్ రీజియన్ ముసాయిదా బిల్లులో విద్యకు తగిన ప్రాధాన్యం కల్పించకపోవడంపై ప్రభుత్వ పాఠశాలల సాధన కమిటీ,గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమా వేశంలో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరంలో జనాభా పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల సంఖ్య పెరగకపోవడం వల్ల నగరంలోని సుమారు 86 శాతం మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని సమావేశంలో పేర్కొన్నారు.పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల ప్రణాళికను దూర ప్రమాణాల ఆధారంగా కాకుండా జనాభా ప్రాతిపదికన రూపొందించాలని ప్రతినిధులు డిమాండ్ చేశారు. ప్రతి కార్పొరేషన్ డివిజన్‌లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు నిరంతర విద్య అందించే తెలంగాణ పబ్లిక్ స్కూల్"లిలను ఏర్పాటు చేయాలన్న తెలంగాణ విద్యా కమిషన్ సిఫారసులను క్యూర్ బిల్లులో పొందుపర్చాలని ప్రభుత్వాన్ని కోరారు.కొత్త కాలనీలు, హౌసింగ్ ప్రాజెక్టులు, విస్తరిస్తున్న నగర ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల కోసం భూమి కేటాయింపును తప్పనిసరి చేయాలని, విద్యను పట్టణ మౌలిక సదుపాయాల్లో కీలక అంశంగా గుర్తించాలని సమావేశం అభిప్రాయపడింది. పిల్లల విద్య రాజ్యాంగబద్ధమైన హక్కు అని పేర్కొంటూ, సమాన విద్యా అవకాశాలు కల్పించే పట్టణాభివృద్ధికి క్యూర్ బిల్లు మార్గదర్శకంగా నిలవాలంటే ప్రభుత్వ విద్య విస్తరణకు స్పష్టమైన నిబంధనలు, లక్ష్యాలు, బడ్జెట్ కేటాయింపులు ఉండాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సమావేశానికి బాలల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ అధ్యక్షత వహించగా, ఎం.వి. ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్. వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా రవి కన్నెగంటి, రిటైర్డ్ ఉపాధ్యాయులు జనార్దన్ హాజరై ప్రభుత్వ విద్య బలోపేతంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.మెగా హైదరాబాద్‌లో ప్రభుత్వ పాఠశాలల సాధన కమిటీ ఏర్పాటుఈ సందర్భంగా ప్రభుత్వ విద్య పరిరక్షణ, విస్తరణ, ప్రతి చిన్నారికి నాణ్యమైన ఉచిత విద్య అందుబాటులోకి తీసుకురావడం, జనాభా ప్రాతిపదికన ప్రభుత్వ పాఠశాలల ఏర్పాటు, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ స్థాపన, ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు, ఉపాధ్యాయుల నియామకాల కోసం ప్రజా ఉద్యమాన్ని నిర్మించే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల సాధన కమిటీ, మెగా హైదరాబాద్ ను ఏర్పాటు చేశారు.కమిటీ కన్వీనర్‌గా సూర వెంకటయ్య (జవహర్‌నగర్), కో-కన్వీనర్లుగా ఎన్. శోభ (మారేడ్‌పల్లి), చిరంజీవి (బండ్లగూడ), జనరల్ సెక్రటరీగా భీమేష్ (బాలాపూర్), జాయింట్ సెక్రటరీగా సత్యకళ (సైదాబాద్) ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా శారద, శరత్ కుమార్ (రవి), రాజేందర్, ఇందిర, త్రిపుర, జయశ్రీ, దుర్గేష్, లక్ష్మి, అమృత నాయుడులను ఎంపిక చేశారు.నాణ్యమైన ప్రభుత్వ విద్య ప్రతి విద్యార్థికి అందేలా తల్లిదండ్రులు, విద్యావేత్తలు, ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధులను కలుపుకొని విస్తృత ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని నూతన కమిటీ ప్రకటించింది.

# ఆకునూరులో ఎస్‌బీఐ బ్యాంకు ఏర్పాటు చేయాలి

**-ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి సీపీఐ వినతి**

చేర్యాల, హిందుస్థాన్ మీడియా:

చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో ఎస్‌బీఐ బ్యాంకు, ఏటీఎం ఏర్పాటు చేయడంతో పాటు పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని పునరుద్ధరించాలని, యువత కోసం మినీ స్టేడియం మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ ఆధ్వర్యంలో గ్రామస్థులు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆకునూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో గతంలో ఉన్న పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తిరిగి ప్రారంభించాలని, గ్రామ ప్రజల సౌకర్యార్థం ఎస్‌బీఐ బ్యాంకు, ఏటీఎం ఏర్పాటు చేయాలని, క్రీడాకారుల ప్రోత్సాహం కోసం మినీ స్టేడియం మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందిస్తూ తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్థులు, సీపీఐ నాయకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



# విధి నిర్వహణలో అప్రమత్తతకు సీపీ ప్రశంసలు





**-చేర్యాల బ్లూ కోల్ట్స్ సిబ్బంది రవి, వెంకటేష్‌కు రివార్డు ప్రదానం**

చేర్యాల, హిందుస్థాన్ మీడియా:

విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించి ఇద్దరు విద్యార్థులను సురక్షితంగా హాస్టల్‌కు చేర్చిన చేర్యాల పోలీస్ స్టేషన్ బ్లూ కోల్ట్స్ సిబ్బంది రవి, వెంకటేష్ లను సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ అభినందించి ప్రశంసాపత్రంతో పాటు రివార్డు ప్రదానం చేశారు. ఈ నెల 11వ తేదీ తెల్లవారు జామున 4 గంటల సమయంలో ముస్త్యాల బస్టాండ్ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు బాలురు అనుమానాస్పదంగా తిరుగుతుండటాన్ని గమనించిన బ్లూ కోల్ట్స్ సిబ్బంది వారిని విచారించారు. తొలుత వాకింగ్‌కు వచ్చామని చెప్పిన బాలురు, అనంతరం ముస్త్యాల ప్రగతి విద్యా నికేతన్‌లో 8వ తరగతి చదువుతున్నామని, హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక బయటకు వచ్చామని తెలిపారు.దీంతో వెంటనే వారిని హాస్టల్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ నిర్వహించి వార్డెన్‌కు అప్పగించారు. విధి పట్ల అప్రమత్తత, బాధ్యతాయుతంగా వ్యవహరించినందుకు సీపీ రష్మీ పెరుమాళ్ వారిని ప్రత్యేకంగా అభినందిస్తూ ప్రశంసాపత్రం, రివార్డు అందజేశారు.

# విద్యార్థులతో నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేపట్టిన మున్సిపల్ కమిషనర్ నాగేందర్

**-'క్యాచ్ ది రైన్' కార్యక్రమంలో భాగంగా అవగాహన**

చేర్యాల, హిందుస్థాన్ మీడియా:

నీటిని పొదుపుగా వినియోగించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని చేర్యాల మున్సిపల్ కమిషనర్ నాగేందర్ అన్నారు. 'క్యాచ్ ది రైన్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చేర్యాల పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులతో నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి నీటి చుక్కను విలువైనదిగా భావించి వృథా కాకుండా కాపాడాలని, ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి వనరుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థులు తమ ఇళ్లలో, పాఠశాలల్లో నీటిని పొదుపుగా వినియోగించడంతో పాటు ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. "ప్రతి చుక్క అమూల్యం... నేటి ప్రతిజ్ఞే రేపటి నీటి భద్రతకు పునాది" అని కమిషనర్ నాగేందర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జె. ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ డి. కృష్ణ, ఏ. రమేష్, వెంకటేష్, శశి ప్రీతం, గంగాధర్, శ్రావణ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు,నాణ్యమైన భోజనం అందించాలి

**-మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత**

**-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

హిందుస్థాన్ మీడియా:

ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.శనివారం జిల్లా కలెక్టర్ నర్సాపూర్ (జి)భైంసా మండలాల్లో పర్యటించారు. నర్సాపూం (జి)మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం,కల్పిస్తున్న వసతులు,విద్యా బోధన, మొత్తం విద్యార్థులు, ఉపాధ్యాయులు,సిబ్బంది సంఖ్య,నేటి హాజరు, తదితర విషయాలను ఆరా తీశారు.రిజిస్టర్లను తనిఖీ చేశారు.రిజిస్టర్లన్నింటిని పకడ్బందీగా నమోదు చేయాలని చెప్పారు. ప్రతి రోజు విద్యార్థులు, ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా హాజరు అయ్యేలా చూడాలన్నారు .విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత,పాఠశాల ప్రాంగణ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సామూహిక మరుగుదొడ్ల సముదాయాన్ని పరిశీలించారు.మరుగుదొడ్ల నిర్మాణాలకు సంబంధించి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఆ తర్వాత భైంసా మండలంలోని గడ్డెన్న వాగు ప్రాజెక్టును కలెక్టర్ పరిశీలించారు.ప్రాజెక్టు వివరాలు,ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు,తదితర వివరాలను అధికారులను అడిగారు.త్రాగు నీటి సరఫరా కు సంబంధించి అంశాలను సమీక్షించారు. భవిష్యత్ ప్రణాళికల ప్రకారం నీటి నిర్వహణ ఉండాలని తెలిపారు. అనంతరం భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయంలో పలు అంశాలపై చర్చించారు.ఈ కార్యక్రమాల్లో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,డిఈఓ భోజన్న, డిఆర్డిఓ విజయలక్ష్మి,ఆర్ డబ్ల్యుఎస్, నీటిపా రుదల శాఖల ఈఈలు సందీప్,అనిల్ తహసిల్దార్ లు శ్రీకాంత్,శశి భూషణ్, ఎంపీడీఓ పుష్పలత,ఎంపివో తిరుపతి రెడ్డి,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది, తదితరులు ఉన్నారు.



# 3 వారాలలో 559డ్రంక్ అండ్ డ్రైవ్  కేసులు

హిందుస్థాన్ మీడియా:

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అన్ని లా అండ్ ఆర్డర్ మరియు ట్రాఫిక్ పి.ఎస్ లలో గడిచిన 3 వారాలలో డ్రంకన్ డ్రైవ్ లో 559 మంది పట్టు బడగా వారిని నిజామాబాదు , బోధన్ మరియు అర్మూర్ కోర్టులలో వారిని హాజరు పర్చగా ఇందులో 31 మందికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించడం జరిగిందని మిగిలిన వారికీ రూ. 52,80,000 జరిమానా విధించారు. కమిషనరేట్ పరిధిలో చేసిన తనిఖీలలో అధిక మొత్తములో త్రాగి వాహనములు నడిపి పోలీస్ వారికి పట్టుబడటం జరిగింది. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ డివిజన్ మరియు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ సమీపాలలో వారి వారి పోలీస్ స్టేషన్ పరిధిలలో వాహనాల తనిఖీలు నిర్వహించడం జరుగుతోంది. వాహన తనిఖీలు నిర్వహించగా ఇందులో మొత్తం 559 కేసుల నమోదు చేయడం జరిగిందనీ నిజామాబాదు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వెల్లడించారు .ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనాదారులు వాహానానికిసంబంధిం చినటువంటి పత్రములు సక్రమముగా తమ వద్ద ఉంచుకోగలరనీ సూచిం చారు. డ్రంకన్ డ్రైవ్లో పట్టుబడిన వారి లైసెన్స్ 6 నెలల పాటు సస్పెండ్ చేయబడుననీ తెలిపారు.



# బిజినెస్

## భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌కు గట్టి షాక్..

## ఆరేళ్ల కనిష్ఠానికి అమ్మకాలు.. 'నథింగ్' మాత్రం దూసుకెళ్లింది!

**భారీగా పతనమైన భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్**
**కాంపోనెంట్ ధరల పెరుగుదలే ప్రధాన కారణం**
**అగ్రస్థానంలో నిలిచిన వివో.. వృద్ధి చూపిన శాంసంగ్**
**ఈ క్లిష్ట పరిస్థితుల్లోనూ దూసుకుపోయిన నథింగ్ బ్రాండ్**
**ఈ ఏడాది మొత్తం 13 శాతం క్షీణత ఉండొచ్చని అంచనా**



భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 2026 రెండో త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు గత ఏడాదితో పోలిస్తే 10 శాతం క్షీణించాయి. గత ఆరేళ్లలో ఒక జూన్ త్రైమాసికంలో ఈ స్థాయిలో అమ్మకాలు పడిపోవడం ఇదే తొలిసారి. స్మార్ట్‌ఫోన్లలో వాడే మెమరీ, ఇతర విడిభాగాల ధరలు విపరీతంగా పెరగడమే ఈ పతనానికి ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో ఫోన్ల ధరలు పెరిగి, వినియోగదారులు కొత్త ఫోన్లు కొనడాన్ని వాయిదా వేసుకుంటున్నారు. ప్రముఖ రీసెర్చ్ సంస్థ కౌంటర్‌పాయింట్ నివేదిక ప్రకారం.. 2025 సెప్టెంబర్ నుంచి ఆ్యాలీ, చీపాచీణ వంటి మెమరీ చిప్‌ల ధరలు దాదాపు నాలుగింతలు పెరిగాయి. ఈ ధరలు భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా. ఈ ప్రభావంతో దాదాపు అన్ని కంపెనీలు తమ ఫోన్ల ధరలను పెంచేశాయి. ముఖ్యంగా బడ్జెట్, మధ్యశ్రేణి సెగ్మెంట్లలో అమ్మకాలు గణనీయంగా తగ్గాయి. రూ.15,000 లోపు సెగ్మెంట్‌లో అమ్మకాలు ఏకంగా 45 శాతం పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

**వివో టాప్.. శాంసంగ్ మాత్రమే గ్రోత్**

ఈ త్రైమాసికంలో 18 శాతం మార్కెట్ వాటాతో వివో అగ్రస్థానంలో నిలిచింది. అయితే, ధరల పెరుగుదల కారణంగా ఆ సంస్థకు చెందిన బడ్జెట్, ౨ సిరీస్ ఫోన్ల అమ్మకాలు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. 14 శాతం వాటాతో ఒప్పో మూడో స్థానంలో ఉండగా, షావోమీ (పోకోతో కలిపి) 13 శాతంతో నాలుగో స్థానంలో, రియల్‌మీ ఐదో స్థానంలో నిలిచాయి. టాప్-5 బ్రాండ్లలో వృద్ధిని నమోదు చేసిన ఏకైక సంస్థగా శాంసంగ్ నిలిచింది. గెలాక్సీ ోూ, ౫ సిరీస్ మోడళ్లకు ఉన్న డిమాండ్, ప్రత్యేక ఆఫర్లతో శాంసంగ్ 2 శాతం వృద్ధి సాధించి రెండో స్థానాన్ని దక్కించుకుంది.

**అందరినీ ఆశ్చర్యపరిచిన 'నథింగ్'**

మార్కెట్ మొత్తం ప్రతికూల పరిస్థితుల్లో ఉన్నప్పటికీ, లండన్‌కు చెందిన 'నథింగ్' బ్రాండ్ మాత్రం అద్భుతమైన పనితీరు కనబరిచింది. గతేడాదితో పోలిస్తే ఏకంగా 105 శాతం వృద్ధిని నమోదు చేసింది. గత పది త్రైమాసికాల్లో తొమ్మిది సార్లు భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న బ్రాండ్‌గా నిలవడం విశేషం. ఆ సంస్థకు చెందిన ఫోన్ (4ఏ) సిరీస్‌కు బలమైన డిమాండ్, కొత్తగా విడుదలైన ఫోన్ (4ఏ) విజయం ఈ వృద్ధికి కారణమయ్యాయి. ఫోన్ (4ఏ) ఫ్లిప్‌కార్ట్‌లో రూ.30,000 పైబడిన సెగ్మెంట్‌లో విడుదలైన మొదటి వారంలోనే టాప్ సెల్లర్‌గా నిలిచింది. తమ బ్రాండ్ ప్రత్యేకమైన డిజైన్, ఆవిష్కరణలు, ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు టైటిల్ స్పాన్సర్‌గా నిలవడం వంటి ప్రచార కార్యక్రమాలు ఈ విజయానికి దోహదపడ్డాయని నథింగ్ సహ-వ్యవస్థాపకుడు అకిస్ ఇవాంజెలిడిస్ తెలిపారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే, 2026 మొత్తం మీద స్మార్ట్‌ఫోన్ మార్కెట్ 13 శాతం క్షీణించే అవకాశం ఉందని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ డైరెక్టర్ తరుణ్ పాఠక్ అంచనా వేశారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐకి పెరుగుతున్న డిమాండ్ కారణంగా మెమరీ కొరత ఏర్పడటం కూడా ఈ పరిస్థితికి ఒక కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## మెస్సీని కట్టడి చేయడమా...

## దాదాపు అసాధ్యం: స్పెయిన్ దిగ్గజం ఆండ్రెస్ ఇనియెస్టా

**-ఫైనల్లో మెస్సీని ఆపడం దాదాపు అసాధ్యమన్న ఇనియెస్టా**
**-ప్రత్యర్థిపై కాకుండా సొంత ఆటతీరుపై దృష్టి పెట్టాలని స్పెయిన్‌కు సూచన**
**-భయం వీడి పూర్తి ఆత్మవిశ్వాసంతో ఆడాలని జట్టుకు పిలుపు**
**-మెస్సీ ప్రదర్శన అసాధారణమని కొనియాడిన స్పెయిన్ లెజెండ్**
**-ఎవరు గోల్ చేసినా పర్వాలేదు, జట్టు ఛాంపియన్‌గా నిలవడమే ముఖ్యమని వ్యాఖ్య**



అర్జెంటీనాతో జరగనున్న ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ పోరులో స్టార్ ఆటగాడు లియోనెల్ మెస్సీని పూర్తిగా కట్టడి చేయడం దాదాపు అసాధ్యమని స్పెయిన్ ఫుట్‌బాల్ లెజెండ్ ఆండ్రెస్ ఇనియెస్టా అభిప్రాయపడ్డాడు. మెస్సీని నిలువరించే వ్యూహాలపై అతిగా దృష్టి పెట్టే బదులు, తమదైన శైలిలో ఆడి ఆధిపత్యం ప్రదర్శించడంపైనే స్పెయిన్ జట్టు దృష్టి సారించాలని సూచించాడు. ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగి, తమను ఫైనల్ వరకు తీసుకొచ్చిన ఆటతీరునే కొనసాగించాలని హితవు పలికాడు. ఈ టోర్నమెంట్‌లో అద్భుతమైన డిఫెన్స్‌తో ఆకట్టుకున్న స్పెయిన్, ఏడు మ్యాచ్‌లలో కేవలం ఒక్క గోల్ మాత్రమే ఇచ్చి అజేయంగా ఫైనల్ చేరింది. మరోవైపు, డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా ఈ టోర్నీలో అత్యధిక గోల్స్ చేసిన జట్టుగా నిలిచింది. కెప్టెన్ మెస్సీ ఒక్కడే 8 గోల్స్, 4 అసిస్ట్‌లతో జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. ఈ నేపథ్యంలో, 'గోల్.కామ్' ఉటంకించిన ఓ ఇంటర్వ్యూలో ఇనియెస్టా మాట్లాడుతూ, "మెస్సీని పూర్తిగా కట్టడి చేయడం అసాధ్యం. స్పెయిన్ తమ ఆటతో అర్జెంటీనాను ఎంతలా ఇబ్బంది పెట్టగలదు, లభించిన అవకాశాలను ఎంత కచ్చితత్వంతో గోల్స్‌గా మలచగలదు అన్నదే ఇప్పుడు ముఖ్యం" అని ఇనియెస్టా వివరించాడు. 2010 వరల్డ్ కప్ ఫైనల్లో స్పెయిన్‌కు చారిత్రక విజయాన్ని అందించిన గోల్ చేసింది ఇనియెస్టానే కావడం విశేషం. బార్సిలోనా క్లబ్‌లో తన మాజీ సహచరుడైన మెస్సీపై ఇనియెస్టా ప్రశంసల వర్షం కురిపించాడు. కెరీర్‌లో చివరి వరల్డ్ కప్ ఆడుతున్నప్పటికీ, మెస్సీ ఇప్పటికీ అసాధారణ స్థాయిలో రాణిస్తున్నాడని కొనియాడాడు. "అతడి ఆటను వర్ణించడానికి మాటలు సరిపోవు. ప్రతీ మ్యాచ్‌లో అతడు చూపించే పట్టుదల, నిబద్ధత చూస్తే సెల్యూట్ చేయాల్సిందే" అని అన్నారు. అదే సమయంలో, డిఫెండింగ్ ఛాంపియన్‌తో తలపడుతున్నప్పటికీ స్పెయిన్ ఆటగాళ్లు ఏమాత్రం భయపడకూడదని ఇనియెస్టా సూచించాడు. "భయంతో ఎప్పుడూ ఆడకూడదు. ఈ టోర్నీలో మన జట్టు ప్రదర్శన క్రమంగా మెరుగవుతూ వచ్చింది. ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత ఆత్మవిశ్వాసంతో మీరు ఫైనల్‌లో ఆడబోతున్నారు. ఎవరి పాత్ర ఏంటో ప్రతీ ఒక్కరికీ తెలుసు. ఎవరు ఆడినా, ఏ స్థానంలో ఆడినా అంతా తమ నియంత్రణలోనే ఉందన్న భావన కలిగిస్తున్నారు" అని జట్టు సత్తాపై విశ్వాసం వ్యక్తం చేశాడు. సెమీఫైనల్లో ఫ్రాన్స్‌ను 2-0 తేడాతో ఓడించి ఫైనల్‌కు దూసుకొచ్చిన స్పెయిన్, మైకెల్ ఒయార్జాబల్, లామిన్ యమాల్, మైకెల్ మెరినో వంటి ఆటగాళ్లతో పటిష్ఠంగా కనిపిస్తోంది. అర్జెంటీనాకు వరుసగా రెండోసారి కప్ దక్కకుండా చేసి, 2010 తర్వాత మళ్లీ ప్రపంచ ఛాంపియన్‌గా నిలవాలని స్పెయిన్ పట్టుదలగా ఉంది. విన్నింగ్ గోల్ ఎవరు కొడతారన్నది ముఖ్యమా అని అడగ్గా, "గోల్ ఎవరు కొట్టినా నాకు పర్వాలేదు. మనం అప్పటిలాగే, ఇప్పుడు కూడా మనం ఛాంపియన్లుగా నిలవడమే ముఖ్యం. విజయాన్ని అందించే గోల్ అయితే చాలు, అది ఎవరు కొట్టారన్నది అనవసరం" అని ఇనియెస్టా స్పష్టం చేశాడు.


# క్రీడలు

### అమెరికా చరిత్రలోనే అత్యంత ఖరీదైన క్రీడా ఈవెంట్..

## ఫిఫా ఫైనల్ టిక్కెట్ల ధరల మోత

**-న్యూజెర్సీలో అర్జెంటీనా, స్పెయిన్ మధ్య జరగనున్న తుదిపోరు**
**-సగటు టికెట్ ధర రూ. 10.9 లక్షలు, కనీస ధర రూ. 7.17 లక్షలు**
**-మెస్సీ చివరి వరల్డ్ కప్ మ్యాచ్ కావడంతో విపరీతంగా పెరిగిన డిమాండ్**

ఫిఫా వరల్డ్ కప్ 2026 ఫైనల్ మ్యాచ్ అమెరికా క్రీడా చరిత్రలోనే సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. న్యూజెర్సీలోని మెట్‌లైఫ్ స్టేడియంలో ఆదివారం జరగనున్న ఈ మహా సంగ్రామంలో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా, స్పెయిన్ జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్ టికెట్ ధరలు ప్రస్తుతం ఆకాశాన్నంటుతున్నాయి. రీసేల్ మార్కెట్‌లో సగటు టికెట్ ధర సుమారు 11,327 డాలర్లు (సుమారు రూ. 10,90,625) పలుకుతుండటంతో, అమెరికాలో 'సూపర్ బౌల్' వంటి మెగా ఈవెంట్లను మించి అత్యంత ఖరీదైన క్రీడా వేడుకగా ఇది నిలిచింది. కనీస టికెట్ ధర కూడా దాదాపు 7,451 డాలర్లు (సుమారు రూ. 7,17,423)గా ఉంది. ఇది అమెరికాలోని సగటు నెలవారీ గృహ ఆదాయం కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. ప్రీమియం సీట్ల ధరలయితే మరింత భారీగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న విపరీతమైన డిమాండు ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణం. కాగా, సెమీఫైనల్స్‌లో ఇంగ్లండ్‌పై 2-1 తేడాతో అర్జెంటీనా, ఫ్రాన్స్‌ను 2-0తో ఓడించి స్పెయిన్ ఫైనల్‌కు చేరుకున్నాయి. ఈ ఫైనల్ మ్యాచ్‌పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. లియోనెల్ మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా వరుసగా రెండోసారి ప్రపంచ కప్‌ను కైవసం చేసుకుని, 1962లో బ్రెజిల్ నెలకొల్పిన రికార్డును సమం చేయాలని పట్టుదలగా ఉంది. మరోవైపు, అత్యంత పటిష్ఠమైన డిఫెన్స్‌తో ఫైనల్‌కు చేరిన స్పెయిన్ రెండోసారి టైటిల్ గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. టోర్నీలో అత్యధిక గోల్స్ సాధించిన అర్జెంటీనా అటాకింగ్‌కు, కేవలం ఒక్క గోల్ మాత్రమే ఇచ్చి దుర్భేద్యంగా ఉన్న స్పెయిన్ డిఫెన్స్‌కు మధ్య జరగనున్న ఈ పోరు అత్యంత ఆసక్తికరంగా మారింది. అమెరికా, కెనడా, మెక్సికో దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ 48 జట్ల మెగా టోర్నమెంట్, అమెరికాలో ఫుట్‌బాల్‌కు పెరుగుతున్న ఆదరణకు నిదర్శనంగా నిలుస్తోంది. తన వరల్డ్ కప్ కెరీర్‌లో బహుశా చివరి మ్యాచ్ ఆడుతున్న మెస్సీని ప్రత్యక్షంగా చూడాలనే అభిమానుల ఆతృత కూడా టికెట్ ధరలు ఈ స్థాయిలో పెరగడానికి ప్రధాన కారణమైంది. ఫలితం ఎలా ఉన్నా, ఈ మ్యాచ్ అమెరికా సాకర్ చరిత్రలో ఒక చెరగని ముద్ర వేయడం ఖాయం.



# 'తీర్ధరూప తాండేయవారిగే' (అమెజాన్ ప్రైమ్) మూవీ రివ్యూ!




టీవీ సీరియల్స్ హీరోగా గుర్తింపు తెచ్చుకున్న కొంతమంది, ఆ తరువాత వెండితెరపై కూడా హీరోలుగా అవకాశాలను .. అభిమానులను సంపాదించుకున్నారు. అలాంటి కథానాయకుల జాబితాలో 'నిహార్ ముఖేశ్' కూడా చేరిపోయాడు. తెలుగులో 'గుప్పెడంత మనసు' సీరియల్ లో 'రిషి' పాత్ర ద్వారా పేరు తెచ్చుకున్న కన్నడ నటుడు ముఖేశ్, 'తీర్ధరూప తాండేయ వారిగే' సినిమా ద్వారా, వెండితెరకి పరిచయమయ్యాడు. 'అమెజాన్ ప్రైమ్'లో తెలుగులోను ఈ సినిమా అందుబాటులో ఉంది.దపృథ్వీ (నిహార్ ముఖేశ్) ఓ ట్రావెల్ వ్లాగర్. మిడిల్ క్లాస్ కుటుంబానికి చెందిన యువకుడు. తల్లితో కలిసి నివసిస్తూ ఉంటాడు. అందమైన .. అనుభూతి ప్రధానమైన ప్రదేశాలకు వెళుతూ, అందుకు సంబంధించిన వీడియోలను పోస్ట్ చేస్తూ ఉంటాడు. జనంలో అతనంటే మంచి క్రేజ్ ఉంటుంది. అయితే అతనికి మాత్రం జీవితం చాలా వెలితిగా ఉంటుంది. అందుకు కారణం, తన చిన్నతనంలోనే తండ్రి శివ శంకర్ (రవీంద్ర విజయ్) ఇల్లొదిలి వెళ్లిపోవడం. ఎక్కడ ఉన్నాడో ఏమైపోయాడో తెలియకపోవడం. తండ్రిలేని కారణంగా స్కూల్ ఏజ్ మొదలు, కాలేజ్ వరకూ పృథ్వీ ఎన్నో అవమానాలను ఎదుర్కొంటాడు. ఇప్పుడు కూడా 'వాక్ మేన్' అతని ఫ్రెండ్స్ అతనిని ఆ విషయంపై హేళనగా మాట్లాడుతూ ఉంటారు. తన తండ్రి ఎందుకు ఇల్లొదిలి వెళ్లిపోయాడనేది అతని ముందున్న పెద్ద ప్రశ్న. ఆయన ఎక్కడ ఉన్నా వెతికి తీసుకురావాలనే ఒక పట్టుదల అతనిలో బలంగా ఉంటాయి. తన తల్లి జానకి (సితార) విశ్వనాథ్ (రాజేశ్ నటరంగ)తో సన్నిహితంగా ఉండటం పృథ్వీకి ఎంతమాత్రం ఇష్టం ఉండదు. తండ్రి ఇల్లొదిలి వెళ్లిపోవడానికి తల్లి ప్రవర్తనయే కారణమని అతను భావిస్తుంటాడు. అందువలన ఆమెతో ముభావంగా ఉంటాడు. అతని ధోరణి జానకిని ఎంతో బాధిస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలోనే అతనికి అక్షర (రచన ఇందర్)తో పరిచయమవుతుంది. అది కాస్తా ప్రేమగా మారుతుంది. ఆమె తండ్రి సీనియర్ జర్నలిస్ట్ రవి రామనాథపుర అని తెలుసుకుని పృథ్వీ షాక్ అవుతాడు. తమ ప్రేమ ఫలించడం కష్టమనే నిర్ధారణకు వస్తాడు. ఒకరోజున రవి రామనాథపుర హఠాత్తుగా చనిపోతాడు. తన కోసం ఆయన రాసి పెట్టిన లెటర్ ను అక్షర చదువుతుంది. అప్పుడు ఆమెకి ఒక చేదు నిజం తెలుస్తుంది. అదేమిటి? పృథ్వీ తండ్రి శివశంకర్ కనిపించకుండా పోవడానికీ, రవి రామనాథపురకి మధ్య గల సంబంధం ఏమిటి? వాళ్లిద్దరికీ సంబంధించిన గతంలో ఏం జరుగుతుంది? అది తెలుసుకున్న అక్షర ఏం చేస్తుంది? తన తండ్రి జాడ తెలుసుకోవాలనే పృథ్వీ కోరిక నెరవేరుతుందా? అనేది మిగతా కథ. ప్రతి ఒక్కరి జీవితంలోను తల్లి - తండ్రి ప్రధానమైన పాత్రలను పోషిస్తారు. ఇద్దరిలో ఎవరు లేకపోయినా, అది మరెవరూ భర్తీ చేయలేని ఒక వెలితిగానే ఉంటుంది. పూర్తి ఆనందాన్ని .. సంతోషాన్ని అందకుండా చేస్తుంది. అలా చిన్నతనంలోనే తండ్రి ప్రేమకి దూరమైన హీరో, అందుకు కారణం తల్లి అనుకుని ఆమెకి తాను దూరంగా మసలుకుంటూ ఉంటాడు. అదే ఆలోచన కారణంగా మనసిచ్చిన అమ్మాయిని కూడా దూరం పెట్టాలని నిర్ణయించుకుంటాడు. చివరికి అతనికి తెలిసే నిజం ఏమిటి? అనే ఆసక్తికరమైన అంశం చుట్టూ ఈ కథను అల్లుకుంటూ వెళ్లారు. తన తండ్రిని జాడ తెలుసుకోవడానికి ఆరాటపడుతున్న పృథ్వీకి, అక్షర సాయపడాలనుకుంటుంది. అయితే అసలు పృథ్వీ తండ్రి కనిపించకుండా పోవడానికి కారకుడు తన తండ్రి రవి రామనాథపురనే అనే విషయం అక్షరకి తెలియడం ఈ కథలో మరో కీలకమైన అంశంగా కనిపిస్తుంది. ఇక్కడి నుంచి కథ కాస్త ఊపందుకుంటుంది. అది క్లైమాక్స్ వరకూ అలాగే కొనసాగుతూ వెళుతుంది. క్లైమాక్స్ ట్విస్ట్ కూడా చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. అయితే ఈ కథ చాలా నిదానంగా మొదలవుతుంది. ఫస్టాఫ్ అంతా కూడా చాలా నింపాదిగా సాగుతుంది. హీరోకి తండ్రిలేడనే అసంతృప్తి .. తల్లి పట్ల అసహనం ఉన్నాయనే విషయాన్ని దర్శకుడు సాగదీస్తూ వెళ్లాడు. లవ్ ట్రాక్ అందుబాటులో ఉన్నా పెద్దగా వాడుకోలేదు. ఆ ట్రాక్ కి కాస్త రొమాన్స్ ను జోడించినా, నీరసానికి నిమ్మరసం దొరికినట్టుగా ఉండేది. ఇక హీరో ఎదుగుదలను ఓర్చలేని గ్యాంగ్ ను కూడా కాస్త హైలైట్ చేస్తే బాగుండేది. దీపక్ ఫొటోగ్రఫీ బాగుంది. మేఘాలయ వంటి లొకేషన్స్ ను తెరపై ఆవిష్కరించిన తీరు గొప్పగా ఉంది. జో కోస్టా బాణీలు .. నేపథ్య సంగీతం ఫరవాలేదు. పాటలకి సంబందించినంత వరకూ సాహిత్యాన్ని గురించి గానీ .. పాడించడం గురించిగాని ఎంతమాత్రం పట్టించుకోలేదనే విషయం అర్థమవుతుంది.

## పుట్టినరోజున ఫ్యాన్స్‌కు ప్రియాంక ట్రీట్..

## 'వారణాసి' నుంచి మందాకిని క్రేజీ లుక్!

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా జోనాస్ తన 44వ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే కానుక ఇచ్చారు. ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న 'వారణాసి' చిత్రం నుంచి ఆమె ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. 'మందాకిని' అనే పాత్రలో ప్రియాంక చోప్రా ఫెరోషియస్ అవతార్‌లో కనిపించి సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేశారు. ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ 'వీక్లీ' ఈ ఫొటోలను ప్రత్యేకంగా పంచుకుంది. ఈ ఫొటోలలో ప్రియాంక పూర్తి నలుపు రంగు దుస్తులలో, ఉంగరాల జుట్టుతో చాలా భిన్నంగా కనిపిస్తున్నారు. ఒక భారీ యాక్షన్ సాంగ్‌లోని స్టిల్స్ ఇవని తెలుస్తోంది. చిత్రంలో ఆమె పోషిస్తున్న 'మందాకిని' పాత్రను "ప్రపంచవ్యాప్తంగా పర్యటించే ఒక ధైర్యవంతురాలు, శక్తిమంతమైన మహిళ. అదే సమయంలో సున్నితమైన భావోద్వేగాలు కలిగి, ప్రేక్షకుల మదిలో చిరకాలం నిలిచిపోయే పాత్ర" అని చిత్ర యూనిట్ వర్గాలు అభివర్ణించాయి. ఆస్కార్ విజేత '===' తర్వాత రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న పూర్తిస్థాయి ఒరిజినల్ ఫీచర్ ఫిల్మ్ 'వారణాసి'. వేల సంవత్సరాల కాలంలో, పురాతన నాగరికతల నుంచి నేటి ఆధునిక యుగం వరకు సాగే ఈ గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ కథాంశంతో రూపొందుతోంది. అంటార్కిటికా, ఆఫ్రికా, పవిత్ర నగరం వారణాసి సహా పలు ఖండాలలో ఈ సినిమా చిత్రీకరణ జరుపుకుంటోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా, టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు సరసన నటిస్తున్నారు. మహేశ్ 'రుద్ర' అనే పాత్రలో కనిపించనున్నారు. అంతేకాకుండా రామాయణ యుద్ధ ఘట్టాలకు సంబంధించిన 20 నిమిషాల సన్నివేశంలో శ్రీరాముడి పాత్రలో కూడా మహేశ్ ద్విపాత్రాభినయం చేయనున్నారని ప్రచారం జరుగుతోంది. మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ చిత్రంలో 'కుంభ' అనే ప్రధాన ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు. మహేశ్, పృథ్వీరాజ్ పాత్రల మధ్య నలిగిపోయే కీలకమైన పాత్రలో ప్రియాంక కనిపించనుంది. 2019లో



వచ్చిన 'ది స్కై ఈజ్ పింక్' తర్వాత ప్రియాంక చోప్రా మళ్లీ భారతీయ థియేటర్లలోకి వస్తున్న సినిమా ఇదే.




Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455